సంక్షేమ ప్రదాత సీఎం జగన్

- కొయ్యూరు, దుంబ్రిగుడ, అడ్డతీగలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ, ధనలక్ష్మి



గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



డి.భీమవరంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కొయ్యూరు: సచివాలయాల పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి నిధులు కేటాయిస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. ఇప్పటికే అనేక సచివాలయాల నుంచి సర్పంచ్‌ల ద్వారా ప్రతిపాదనలు వెళ్లాయన్నారు.ఆ నిధులతో మౌలిక వసతుల కల్పన చేయవచ్చన్నారు. రత్నంపేట పంచాయతీలో కొత్త పాడి, పాతపాడి, పాత, కొత్త రత్నంపేటలలో గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 265 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి ధనలక్ష్మి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో సంక్షేమ ప్రదాతగా నిలిచారన్నారు. సంక్షేమ పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో సమస్యలను పలువురు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇందులో భాగంగా రత్నంపేట–పాతపాడి మధ్యలో పాడైన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణం చేయాలని స్థానికులు కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సర్పంచ్‌లు నూకరత్నం, రాజకుమారి, వెంకటలక్ష్మి, శ్రీను, చంద్రరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు, నాయకులు సత్యనారాయణ, జల్లి బాబులు, సావిత్రి, బాబ్జి, సుధాకర్, వనంబాబు,అచ్చిరాజు, రవి, తహసీల్దారు తిరుమలరావు, ఎంఈవో బోడంనాయుడు, ఎంపీడీవో మేరీరోజ్, జేఈ విశ్వతేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

దుంబ్రిగుడ: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యమిస్తానని, ఇందుకోసం గ్రామాల్లో పర్యటిస్తున్నట్టు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. మండలంలోని కొర్రా గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గొందిగుడ గ్రామంలో ఉదయం 8గంటలకు సందర్శించారు. గ్రామస్తులు అందజేసిన అంబలిని గిరిజన సంప్రదాయ పద్ధతిలో అడ్డాకుల దొప్పలో తాగారు. గ్రామస్తులకు యోగక్షేమాలను అడిగి తెలుసుకొని, కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొర్రా గ్రామ సచివాయం పరిధిలో గల గొందిగుడ, కొర్రా, గొందివలస, బలియగుడ గ్రామాల్లోని 234 గడపలకు సందర్శించారు. గ్రామస్తులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రామాల్లో సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, సర్పంచ్ అర్జున్, ఎంపీటీసీ సభ్యురాలు గుజ్జెల విజయ, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి, సర్పంచ్‌లు నాగేశ్వరరావు, సుబ్బారావు, నాయకులు సింహాచలం, కృష్ణారావు, శ్రీరాములు, గణపతి, బాలరాజు, బాబూరావు, సుమన్, బలరాం, చిరంజీవి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అడ్డతీగల: గిరిజనాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని డి.భీమవరం, కోవెలపాలెం, పాతపాడు గ్రామాల్లో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ గడప గడపకూ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలను తీసుకొచ్చిందన్నారు. రాష్ట్ర రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కారు రాంబాబు, ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామాల్లో వైద్య శిబిరాలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాంబాబు

దుంబ్రిగుడ: మండలంలోని కంద్రుం పంచాయతీ స్వర్ణయిగుడ, పతలంగి గ్రామాల్లో సర్పంచ్ హరి ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో డాక్టర్ రాంబాబు సుమారు 60 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేసినట్టు సర్పంచ్ చెప్పారు. వైద్య సిబ్బంది బాబూరావు, సావిత్రి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పాడేరు రూరల్: పట్టణంలోని అయ్యప్పస్వామీ ఆలయంలో ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 216ఎ ఆరవ రీజియన్ రెండో జోన్ వాసవి క్లబ్ ప్రతినిధులు క్షీరాభిషేకం, కుంకుమార్చన ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రసాదాలను స్వీకరించారు. వాసవి క్లబ్ జోన్ చైర్‌పర్సన్ శ్రీనాథ్ మణి, ప్రతినిధులు సంతోష్, రమేష్, కొండాజీ, అప్పారావు, మణి, గౌతమి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు



శస్త్రచికిత్స కోసం విశాఖ వెళ్తున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి: గత నెలలో దారకొండలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో శస్త్ర చికిత్స కోసం గుర్తించిన తొమ్మిది మందిని సోమవారం విశాఖపట్నం తీసుకెళ్లినట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు చెప్పారు. ఐటీడీఏ పీఓ గోపాలకృష్ణ ఆదేశాల మేరకు వారిని ప్రత్యేక అంబులెన్సులో విశాఖలో ఉచిత శస్త్ర చికిత్సల నిమిత్తం తీసుకువెళ్లినట్టు తెలిపారు.

మృతుడి కుటుంబానికి బీమా అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందచేస్తున్న బ్యాంకు సిబ్బంది

వీఆర్ పురం: ఇటీవల మృతిచెందిన నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు రేఖపల్లి ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ ఎం.రామకృష్ణ ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా రూ.2 లక్షల చెక్కును సోమవారం అందచేశారు. తుమ్మిలేరు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు ఏపీజీవీబీలో ప్రధాన మంత్రి జీవన జ్యోతి పథకం కింద బీమా చేయించుకున్నారని మేనేజర్ తెలిపారు. అతడు మృతితో బీమా వర్తించిందన్నారు. అఖిల్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ



ఆర్వోఎఫ్ఆర్ పట్టాలను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ అప్పలస్వామి

జి.మాడుగుల: మండలంలో వంతాల పంచాయతీలోని గిరిజన పోడు వ్యవసాయం సాగుదారులకు తహసీల్దార్ కె.అప్పలస్వామి తదితరులు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలను సోమవారం పంపిణీ చేశారు. మండల కన్వీనర్ కళ్యాణం, మాజీ సర్పంచ్ కొండబాబు, వార్డు సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపు హర్షణీయం



పాడేరులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు



అరకులోయలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

పాడేరు రూరల్: ఎస్సీ ,ఎస్టీ సబ్ ప్లాన్‌ను పదేళ్ల పాటు పొడగింపుంపై గిరిజనులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీలకు సంబందించిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను మరో పదేళ్ల పాటు పొడిగించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన పక్షపాతి అని మరోసారి నిరూపించారన్నారు. గిరిజనుల కోసం ఎన్నో పథకాలు నెలకోల్పి మేలు చేస్తున్నారన్నారు.రానున్న ఎన్నికల్లో మరోమారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అధికారం ఇచ్చేందుకు గిరిజనులందరూ సిద్ధంగా ఉన్నారని చెప్పారు.పాడేరులోని ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు సోమవారం పాడేరులో ఆమె క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు అన్నారు. పాడేరు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కూతంగి సూరిబాబు, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర, సర్పంచ్‌లు వి.రాంబాబు, వి.బసవన్నదొర, జి.చిట్టిబాబు, కె.సన్నిబాబు, ఎంపీటీసీలు డి.సన్యాసిరావు, ఎల్.రామకృష్ణ పాత్రుడు, కె.నర్సింహమూర్తి, టి.ఎర్రయమ్మ, నాయకులు సత్యనారాయణ, కన్నాపాత్రుడు, రామారావు, రాజారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామన్న, పార్టీ విశాఖ ఉమ్మడి జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్ తదితరులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. నాయకులు రఘునాథ్, కిరణ్, సంపత్‌కుమార్, శివ, సత్యానందం, అర్జున్, బాలరాజు, నర్సింగ్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ గడవు మరో పదేళ్ల పాటు ప్రభుత్వం గిరిజనులకు వరం అని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. ప్రజ సంఘాల నాయకులు రామన్న, బుజ్జిబాబు, నానిబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

జి.మాడుగుల: ఎస్టీ, ఎస్సీ సబ్ ప్లాన్ గడువు మరో పదేళ్ల పొడిగింపు నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికు వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనాభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించడం అభినందనీయన్నారు.



ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు వెంకటలక్ష్మి

ఉపాధి పనుల పరిశీలన



వయ్యేడు గ్రామంలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

రాజవొమ్మంగి: మండలంలోని వయ్యేడు గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న చెరువు తవ్వకం పనులను ఎంపీడీవో బాపన్నదొర ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మస్టర్లు పరిశీలించారు. పాధి పనులకు వచ్చే ప్రతి వేతనదారుకు రోజువారీ వేతనం రూ.255 గిట్టుబాటు కావాలని సిబ్బందికి సూచించారు. అందుకు అనుగుణంగా కొలతలు తీసి పనులు అప్పగించాని ఆదేశించారు. శాంతిగర్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తాగు నీరు, రన్నింగ్ వాటర్ అవసరాల కోసం బోరు బావి పనులకు భూమి పూజ చేశారు.

ఘనంగా నేతాజీ జయంతి



అరకులోయ డిగ్రీ కాలేజీలో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది



దుంబ్రిగుడులో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేతాజీ గొప్ప స్వతంత్ర్య సమరయోధులని, ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, అధ్యాపకులు పుష్పరాజు, సుజాత, ప్రసాద్, అనితకుమారి, శోభన్, రాజు, సంధ్య, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండలంలోని కించుమండ పంచాయతీ కొసాగుడ గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడు విలియం కేరి ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిరువ్యాపారులకు సూచనలు



చిరువ్యాపారులతో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజా రమేష్, నాయకులు

అరకులోయ రూరల్: సుంకరమెట్ట పంచాయతీ పరిధిలోని గాలికొండ వ్యూ పాయింట్ వద్ద చిరు వ్యాపారాలు చేసుకుంటున్న పిరిబంద, బోయిగూడ, బల్లియగూడ గ్రామలకు చెందిన గిరిజనులు స్థలం విషయంపై తగాదా పడ్డారు. ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్ ఇరువర్గాలతో సోమవారం సమావేశం నిర్వహించారు. తగాదాలు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. శాశ్వత షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

సామూహిక సీమంతాలు



సీమంతం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది

వై.రామవరం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకట లక్ష్మి, వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి ముఖ్య అతథులుగా పాల్గొన్నారు. గర్భిణులకు గుడ్లు, పాలు తదితర పౌష్టికాహారాలు అందజేశారు. పలువురు మాట్లాడుతు ఐసీడీఎస్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. నాయకులు కనకరాజు, అబ్బాయిరెడ్డి, సర్పంచ్ వెదుళ్ల సత్యన్నారాయణ రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త జి.బేబిరాణి, సచివాలయ, వెలుగు సిబ్బంది. పాల్గొన్నారు.

గ్రామాల్లో గృహ సారథుల నియామకాలు



కొండపడలో గృహ సారథుల నియామకాలను పర్యవేక్షిస్తున్న నేత మల్లికార్జున్

ముంచంగిపుట్టు: ఏనుగురాయి, దార్రెల, కిలగాడ, బంగారుమెట్ట, వనభసింగి పంచాయతీల్లో సోమవారం గృహ సారథుల నియమకాలను మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నేతలు నిర్వహించారు. ఒక వలంటీర్‌కు ఇద్దరు గృహసారథులను నియమిస్తున్నట్టు చెప్పారు. 18 పంచాయతీల్లోను నియమకాలు పూర్తయినట్టు తెలిపారు. సర్పంచ్ నరసింగరావు, నేతలు రామ్‌ప్రసాద్, మన్మథరావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

పాడేరు రూరల్: పాడేరు ఆర్టీసీ బస్ డిపో పరిధిలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని ఆదివాసీ వర్తక సంఘం ప్రతినిధులు ప్రసాద్‌రావు, సూర్యనారాయణ డిమాండ్ చేశారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాల నిర్మాణానికి టెండర్ల ఆహ్వానంలో గిరిజనేతరులను ఆహ్వానాన్ని విరమించుకోవాలన్నారు. దుకాణాలు నిర్మించి గిరిజన నిరుద్యోగులకు కేటాయించాలన్నారు. మాణిక్యం, లింగమూర్తి, గణేష్, రాధాకృష్ణ, ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయమందించిన దాతలు

పాడేరు రూరల్: చింతలవీధికి చెందిన ఎలక్ట్రిషియన్ పొట్నూరి వెంకటరమణ ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు ఉమానీలకంఠేశ్వర ప్లంబింగ్ అండ్ ఎలక్ట్రిషియన్ యూనియన్ తరపున సభ్యులు మృతుడి కుటుంబానికి రూ.18వేలు అందజేశారు. సంఘం సభ్యులు రామారావు, దామోదరం, శేఖర్, సన్యాసిరావు, స్వామి నాయుడు, కృష్ణారావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాచుపాము హతం



రాజవొమ్మంగి: అప్పలరాజుపేట గ్రామంలో ఓ ఇంట్లోకి ప్రవేశించిన ఆరు అడుగుల తాచు పాము సోమవారం హల్‌చల్ చేసింది. ఇంట్లో ప్రవేశించిన పామును హనుమంతు లక్ష్మి గమనించి కేకలు వేసి బయటకు పరుగులు తీశారు. విషయాన్ని తెలుసుకున్న స్థానికులు పామును హతమార్చారు.

శ్మశానవాటికలో శివుని విగ్రహం ఏర్పాటు



శివుని విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

దేవీపట్నం: ఇందుకూరుపేటలోని శ్మశాన వాటికలో శివుని విగ్రహం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గారపాటి బాబూరావు తన సొంత ఖర్చులతో శ్మశాన వాటికలో రచ్చబండ, శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. ఎంపీపీ కుంజం మురళీ, కందుల బాబ్జి, సత్యనారాయణ, కృష్ణబాబు, బాబూరావు, అన్నారం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫారాల అందజేత



విద్యార్థులకు యూనిఫారాలను అందజేస్తున్న దాతలు

జి.మాడుగుల: మండలంలో గడుతూరు పంచాయతీ వనమామిడి గ్రామంలో సోమవారం దువ్వాడ శ్రీ కుసుమహరనాథ నామ ప్రచార సంఘం ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులకు యూనిఫారాలు, గిరిజన మహిళలకు చీరలు పంపిణీతో పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ కుసుమహరనాథ నామ ప్రచార సంఘం, అనకాపల్లి కెమిస్ట్, డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్, వాసవీ క్లబ్, లయన్స్ క్లబ్, భారత్ వికాస్ పరిషత్, శ్రీ కుసుమహర యువ సేవా సంఘం, సత్యదేవ్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సంయుక్తంగా 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభ

రాజవొమ్మంగి: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోతున్న యజమానులతో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి తెలిపారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. దూసరపాము, రాజవొమ్మంగి, సూరంపాలెం గ్రామాల్లో స్థలాలు కోల్పోతున్న వారు హాజరుకావాలని కోరారు.

నేడు కొండగోకిరిలో 'గడప గడపకు'

కొయ్యూరు: కొండగోకిరి పంచాయతీ పరిధిలోని గుజ్జుమానుపాకలు, కొండగోకిరి, కినపర్తి పంచాయతీల్లో భీమవరం, ములగలమెట్ట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి హాజరవుతున్నాయని, పార్టీశ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వాహన తనిఖీలు

వై.రామవరం: మండల కేంద్రంలో ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహన రికార్డులు తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, వాహన పత్రాలు సక్రమంగా లేనివారిపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో స్టేషన్ సిబ్బందితో పాటు సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.